# - బ్రతుకుబాట -

= రచన : శ్రీ సి. హెచ్. సోమలింగం =

(గత సంచిక తరువాయి)

అతని జీవన నావ, నడి సముద్రంలో కష్టాలనే తుఫాను గాలికి, అల్లాడి, తీరానికి, దారి తెలియక, కొట్టుమిట్టాడుతున్న సమయంలో, అతన్ని, ఒక దరికి చేర్చి, బ్రతుకుబాటును చూపించినవారితో, 'తమ సమార్తెను ప్రేమించానని' ఎట్లా చెప్పగలడతను.......... రజస్వరాలయినతరువాత, రాధను, అతని ప్రేయసికి, వేరొక వరుని నిశ్చయించినపుడు, అతని హృదయం, ఎంతో ఆవేదనతో దహించుకుపోతున్నా కూడా, ఆ అగ్నిజ్వాలలను తనలోనే ఇముడ్చుకుని, రాధ సౌఖ్యం కోసం, తన ప్రేమనే త్యాగం చేసాడతను.—కానీ; ఎంతో ఆనందంగా, నిర్విఘ్నంగా జరిపిన ఆ వివాహం, 'మూడునాళ్ల ముచ్చటే' అయింది రాధకు ... పాపం ! అభాగ్యురాలు రాధ !!... ...

ఆ దెబ్బతో, తనని ఎవరో శిక్షిస్తున్నట్లు, తన ఎద మీద ఎవరో పెద్ద ఇనుప గుండ్లతో మోదినట్లు, బాధ పడినాడతను ... ' భగవాన్ ! ... ఆమె జీవితాన్నే నాశనం చేసావా !! అని మనసులోనే అనుకున్నాడతను...ఆ క్షణంలో;...

నిండా, పదునెనిమిది వసంతాలు నిండని రాధ; జీవితంలో, ఎంతో ఆనందాన్ని, సౌఖ్యాన్ని అనుభవించవలసిన రాధ; పెళ్ళయి, ముచ్చటగా మూడు నెలలు కాకముందే, ఆమె పసుపు కుంకుమలను, మంటిలో కలిపి; ఆమె జీవితాన్నే నాశనం చేసింది విధి ... విధవయై, పడివున్న రాధను చూస్తుంటే, అతని సుకుమారమైన హృదయం, ఆవేదనతో, తరుక్కుపోయింది.....

భర్తతో, పదికాలాలపాటు సుఖమయ జీవితాన్ని గడపవలసిన రాధ, తన మూలంగానే, విధికి భానిసయై, భర్తను కోల్పోయిందేమోనని అనిపించింది అతనికి...చిగురిస్తున్న ఆమె కోరికలు, ఆశలూ, సమూలంగా, విధియొక్క వేడిమికి వాడి, ఎండిపోయి, నేల రాలిపోయాయి...ఆమె జీవితం, 'నందనవనం'లా అవడానికి మారుగా, పెను తుపానులతో నిండిన ఎడారిలా తయారయింది.........

తన రాధ,...చిన్నప్పటినుండి, కలసి మెలసివున్న రాధ; నిరాశా నిస్పృహలతో కృంగిపోతున్న రాధకు, దారి ఏది?...అనిపించింది అతనికి. కానీ, యుక్తవయసులోవున్న రాధకు, తను చేయూతనిచ్చి, జీవిత భాగస్వామినిగా, సహధర్మచారిణిగా చేసుకోవడంలో తప్పు ఏముంది? అనిపించింది అతని మనసులో; మరల రాధను, తన మనసు కోరుతోందేమోననిపించింది...ఆ ఆలోచన మనసులోకి రాగానే, కలుగబోవు దారుణ పరిస్థితులకు భయంతో వణికి పోయింది అతని హృదయం.........

ఆనాడు రాధ సుఖంకోసం, ఆనందంకోసం, త్యాగం చేసాడతను. ఈనాడు, ఆ రాధకోసమే, ఆమె జీవితంకోసమే, ధైర్యంగా, త్యాగం చెయ్యడంలో తప్పులేదని బోధిస్తోంది అతని మనసు ... ఫలితంగా; రాధతో రెండవ పెళ్ళి అతి నిరాడంబరంగా జరిగిపోయింది.........

'జిగ్'మని మెరిసింది మెరుపు. వెనువెంటనే, ఎక్కడో సుదూర ప్రాంతంలో చెట్టుమీద పిడుగు పడింది. భయంకరంగా గర్జిస్తూ; ఉలిక్కిపడ్డాడు రఘు...అతని ఆలోచనా తంత్రులు తెగిపోయాయి....

ఆ పిడుగు శబ్దానికి ఉలికిపడి లేచింది రాధ... మంచం పక్కన కూర్చున్న రఘును భయంతో కౌగిలించుకుంది.........

'రాధా ...'అని పిలిచాడు ఆప్యాయంగా, ఆమె' ముఖం పైకెత్తి...

'ఊఁ...అంది'; అతని హృదయంపై తలదాచుకుంటూ, ఆమె ముఖంలో భయచిహ్నాలు గోచరిస్తున్నాయి....

కిటికీలోనుండి బైటకు చూసాడు రఘు ... ప్రకృతి ఇంకా కోపంగానే వుంది....

సమాజంలో, పరువుగా 'బ్రతుకుబాట'ను, ఏర్పరచుకోవాలని ఉవ్విళ్ళూరిన, మన జీవితాలుకూడ ఈనాటి ప్రకృతిలాగే, అల్లకల్లోలంగా వున్నాయి రాధా!... అని మనసులోనే అనుకుని,నిట్టూర్చాడు రఘు .....!